క్లుప్తంగా

ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే గొంగిడి సునీతకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ రాజు, గ్రామస్తులు

రాజాపేట : మండలంలోని మల్లగూడెం గ్రామానికి రేషన్‌దుకాణం మంజూరు చేయాలని కోరుతూ ఆ గ్రామస్తులు శనివారం ఎమ్మెల్యే గొంగిడి సునీతను ఆలేరులో కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా గ్రామంలో సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని కోరారు. కలిసిన వారిలో గ్రామ సర్పంచ్ గొడుగు రాజు, నాయకులు రెడ్డబోయిన రాజు, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఆకుల శ్రీనివాస్‌కు డాక్టరేట్



శ్రీనివాస్

బీబీనగర్ : మండలంలోని ముగ్దుంపల్లి గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ డాక్టరేట్ పొందారు. రాయలసీమ యూనివర్సిటీలోని సింథటిక్ అండ్ బయలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ నోవెల్ హిటిరోసైక్లిక్, క్రోమోన్స్ అండ్ హైబ్రిడ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు శనివారం ఆయన తెలిపారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చౌటుప్పల్ : ఖాతాదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్ జీఎం దేవరిష్‌మిత్ర తెలిపారు. మండల పరిధిలోని దామెర గ్రామంలో శనివారం సంధ్యా శిబిరం ఏర్పాటు చేశారు. రైతు రుణాలు, వ్యాపార, ఎస్‌హెచ్‌జీ రుణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఏజీఎం జ్యోతిలక్ష్మి, రామచందర్, సుధాకర్‌రెడ్డి, పుష్పలత, మమత, నర్సింహ, భాస్కర్, భారతి, ప్రమోద్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ తాపడానికి రూ.51వేల విరాళం



చెక్కు అందజేస్తున్న భాస్కర్, కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి విమాన గోపురం స్వర్ణ తాపడానికి యాదగిరిగుట్టకు చెందిన బెలిదె భాస్కర్ గుప్త కుటుంబ సభ్యులు శనివారం ఆలయ అధికారి జి.రఘుకు రూ.51,116ల చెక్కును అందజేశారు. శ్రీస్వామి వారిని దర్శించుకున్న అనంతరం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద అష్టోత్తర పూజలు చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

భువనగిరి : పట్టణంలోని 20వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పచ్చల జగన్మోహన్ శనివారం హైదరాబాద్‌లో కుంభం అనిల్ కుమార్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌కు ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అరాఫత్

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల, కళాశాలలో శనివారం 148మంది బాలికలకు రాష్ట్రీయ బాలల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ డాక్టర్ అరాఫత్, ఏఎన్‌ఎంలు లలిత, ఎండీ.జహేదా, ఫార్మాసిస్టు అన్నపూర్ణ, పాఠశాల హెచ్‌ఎం యాదమ్మ, ఉపాధ్యాయులు రేఖ, ఉమ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో చోరీ

బొమ్మలరామారం : గుర్తుతెలియని వ్యక్తులు తాళం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన బొమ్మలరామారం మండలం మేడిపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మేడిపల్లి గ్రామానికి చెందిన ఎం.డీ సర్దార్ కుటుంబ సభ్యులు మోహర్రం పండుగ సందర్భంగా పంచాయతీ సమీపంలో గల పీర్ల కొట్టం వద్ద శుక్రవారం పూజలు నిర్వహించారు. సర్దార్ ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా చూసిన దొంగలు చొరబడ్డారు. పీర్లకు వేసే పూలు ఇంట్లో ఉండడంతో వాటిని తీసుకెళ్లేందుకు సర్దార్ తండ్రి జహంగీర్ ఇంటికి వచ్చాడు. వస్తువులు చిందరవందరగా ఉండడంతో కుమారుడికి ఫోన్ చేశాడు. సర్దార్ వచ్చి చూడగా బీరువాలోని రెండు బంగారు ఉంగరాలు, చెవి కమ్మలు నక్లెస్, రూ.27 వేలు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌హెచ్‌ఓ ట్రైనీ ఐపీఎస్ శివం ఉపాధ్యాయ, ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాలకు మహర్దశ



ఆత్మకూరు(ఎం)లో డబుల్ రోడ్డుతో పాటు ఏర్పాటు చేయనున్న సెంట్రల్ లైటింగ్



బీటీ రోడ్డుగా మారనున్న మోదుబావిగూడెం వెళ్లే మట్టి రోడ్డు

- అభివృద్ధి పనులకు రూ.15.30కోట్ల నిధులు మంజూరు
- తీరనున్న పలు గ్రామాల్లోని సమస్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఆత్మకూరు(ఎం) : మండలంలోని ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడంతో గ్రామాలకు మహర్దశ పట్టనుంది. మండలంలో వివిధ అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండడంతో ఎప్పుడు అభివృద్ధి జరుగుతుందోనని ఎంతో కాలంగా మండల ప్రజలు నిరీక్షిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించడంతో ఆయా గ్రామాలు పలు అభివృద్ధికి నోచుకోనున్నాయి. ఇప్పటికే ఎస్‌డీఎఫ్ నిధులతో గ్రామాల్లో చాలా వరకు మౌలిక వసతుల సమస్యలు పరిష్కారమయ్యాయి.

గ్రామాలకు మంజూరైన పనులు..

మండల కేంద్రమైన ఆత్మకూరు(ఎం) మెయిన్ రోడ్డు నుంచి శివాలయం వరకు రెండు కిలోమీటర్ల దూరం వరకు రోడ్డు వెడల్పు లేకపోవడంతో ప్రయాణికులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజా ప్రతినిధులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు కోసం రూ.1.80కోట్లు నిధులు మంజూరు చేశారు. అదే విధంగా కప్రాయపల్లి నుంచి వయా మోదుబావిగూడెం మీదుగా ఉప్పలపహాడ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5.50కోట్లు, అదే విధంగా సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, తొర్రూరు జిల్లాలకు చెందిన వారికి యాదాద్రి పుణ్యక్షేత్రానికి దగ్గరి దారి అవుతుండంతో రాయిగిరి–మోత్కూరు రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో నియోజకవర్గ పరిధిలో కాటేపల్లి నుంచి కప్రాయపల్లి వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.8కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల మంజూరుతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా మంజూరైన నిధులకు వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఆయా అభివృద్ధి పనులు ప్రారంభించి త్వరగా సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చాలా సంతోషంగా ఉంది



మండలంలో మాది మారుమూల గ్రామం. గ్రామపంచాయతీగా ఏర్పడి సుమారు 40ఏళ్లు అవుతుంది. గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లడానికి రెండు దిక్కులా మట్టి రోడ్లు ఉన్నాయి. అవి పూర్తిగా గుంతలమయంగా మారాయి. వర్షాకాలంలో అధ్వానంగా ఉంటుంది. మా గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.5.50కోట్లు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉంది.

– బబ్బూరి మాధవీ, సర్పంచ్, మోదుబావిగూడెం

నిధుల మంజూరు హర్షణీయం



ఆత్మకూరు మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు, రోడ్డు వెడల్పుకు నిధులు మంజూరు చేయడం హర్షణీయం. ఈ నిధులతో ఆత్మకూరు(ఎం) గ్రామం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. మంజూరైన నిధులకు త్వరగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన పనులు త్వరగా మొదలు పెట్టేలా చూడాలి.

– జన్నాయికోడె నగేష్, సర్పంచ్ ఆత్మకూరు(ఎం)

బకాయి చెల్లిస్తేనే పొలం దున్నుతానన్నందుకు దాడి

- తీవ్ర గాయాలతో వృద్ధుడు మృతి
- వలిగొండ మండల పరిధిలో దారుణం

వలిగొండ : పాత బకాయి చెల్లిస్తేనే పొలం దున్నుతానన్నందుకు ముగ్గురు వ్యక్తులు ఓ వృద్ధుడిపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అతను ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని చిత్తాపురంలో శుక్రవారం రాత్రి ఈ దారుణ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తాపురం గ్రామానికి చెందిన కొళ్ల నర్సిరెడ్డి(60)అదే గ్రామానికి చెందిన అరూరు వెంకటయ్య పొలాన్ని కొంతకాలం నుంచి కిరాయికి దున్నుతున్నాడు. యాసంగి సీజన్లో ట్రాక్టర్ దున్నిన కిరాయి డబ్బులు వెంకటయ్య ఇప్పటికీ ఇవ్వలేదు. వెంకటయ్య ప్రస్తుత వానాకాలం సీజన్‌లో కూడా తన పొలం దున్నాలని నర్సిరెడ్డిని కోరడంతో నిరాకరించాడు. పాత బకాయి చెల్లిస్తేనే దున్నుతానని స్పష్టం చేశాడు.

పంచాయతీ వద్ద ఉన్నాడని..

తన పొలం దున్ననని నర్సిరెడ్డి తేల్చిచెప్పడంతో వెంకటయ్య కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయారు. శుక్రవారం రాత్రి నర్సిరెడ్డి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్నాడని తెలుసుకుని వెంకటయ్య భార్య, కుమారులైన అరూరు ఉపేందర్, శ్రవణ్, బాలమ్మ ముగ్గురు కలిసి పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం నర్సిరెడ్డితో వాగ్వాదానికి దిగి ముగ్గురు కలిసి మూకుమ్మడిగా అతడిపై దాడి చేశారు. నర్సిరెడ్డి పొత్తి కడుపులో అరూరు ఉపేందర్ కాలితో బలంగా తన్నడంతో అక్కడికక్కడే కుప్పకూలి స్పృహతప్పిపోయాడు. గ్రామస్తుల సహకారంతో కుటుంబ సభ్యులు నర్సిరెడ్డిని తొలుత రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు భువనగిరి ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో అక్కడికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పొలం దున్నలేదనే కక్షతో దాడి చేసి హత్య చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

రాజాపేట : మండలంలోని రఘునాథపురం, రాజాపేట గ్రామాల్లో శనివారం ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామస్తులు నగర సంకీర్తన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకనామంతో భజన చేస్తూ గ్రామంలోని ప్రధాన వీధుల్లో సంకీర్తన కొనసాగించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు చలివేదుల రామకృష్ణశర్మ, భక్తులు చిలక లక్ష్మీనారాయణ, సోమసాని రాజమల్లయ్య,



నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

బెజుగం ఆత్మలింగం, బాబూరావు, భాస్కర్, సోమరాజు, శ్రీను, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా రైతు బీమా పథకం



బీమా చెక్కు అందజేస్తున్న ఎంపీపీ అంజయ్య

అడ్డగూడూరు : పేదలకు అండగా రైతు బీమా పథకం నిలుస్తుందని ఎంపీపీ దర్శనాల అంజయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన రైతు పులిపలుపుల యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతడికి ప్రభుత్వం నుంచి మంజూరైన రైతు బీమా రూ.5లక్షల చెక్కును వారు శనివారం అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగులపల్లి దేవగిరి, రవి, పరమేష్, అరవింద్, రమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



మల్లయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జహంగీర్ తదితరులు

యాదగిరిగుట్ట రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానలపై పోరాటాలు సాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, సర్పంచ్ బీమగాని రాములు అన్నారు. శనివారం మండలంలోని పెద్దకందుకూరులో భీమగాని మల్లయ్యగౌడ్ 14వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిజాం, నిరంకుశ, బానిసత్వంపై వారి దురాగతాలపై పోరాడిన యోధుడు మల్లయ్య అని చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మంగ నర్సింహులు, మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, శాఖ కార్యదర్శి కాలే స్వామి, జోగు శ్రీనివాస్, చంద్రయ్య, కిష్టయ్య, యాదగిరి, వెంకటేష్ తదితరులున్నారు.

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని ఆందోళన



రాస్తారోకో చేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

ఆత్మకూరు(ఎం) : ముదిరాజ్‌లను కించపరిచే విధంగా మాట్లాడిన కొరటికల్ గ్రామ సర్పంచ్ కోల సత్తయ్యపై చర్యలు తీసుకోవాలని ఆదే గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు మండలంలో రాయిగిరి–మోత్కూరు మెయిన్‌రోడ్డుపై శని వారం రాస్తారోకో చేశారు. గ్రామంలో ఇటీవల వర్షాలకు రెండు చెరువులు నిండి అలుగుపోస్తుండడంతో చేపలు వెళ్లిపోకుండా రక్షణగా జాలీలు ఏర్పాటు చేసుకున్నామని, సర్పంచ్, ఉప సర్పంచ్ వారి అనుచరులతో వచ్చి మాపై దౌర్జన్యానికి దిగి జాలీలు తొలగించడమే కాకుండా దిక్కున చోట చెప్పుకోమంటూ కులాన్ని కించపరిచే విధంగా మాట్లాడారని ఆరోపించారు. అనంతరం స్థానిక ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చామకూర అంజనేయులు, మురళి, స్వామి, చంద్రయ్య, ముత్తయ్య, రమేష్ పాల్గొన్నారు.

చిన్నేరు వాగుపై బ్రిడ్జి నిర్మించాలి



చిన్నేరు వాగును పరిశీలిస్తున్న నాయకులు

భువనగిరి : మండలంలోని అనాజీపురం, బీబీనగర్ మండలం రావిపహాడ్ గ్రామాల మధ్య గల చిన్నేరు వాగుపై బ్రిడ్జిని నిర్మించి ప్రజల ప్రాణాలు కాపాడాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అనాజీపురం పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో చిన్నేరు వాగు వద్ద ప్రవహిస్తున్న నీటిని పరిశీలించి మాట్లాడారు. వాగు నుంచి నీరు ప్రవహించినప్పుడు సుమారు 30నుంచి 50 రోజుల పాటు ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నట్లు తెలిపారు. దీంతో రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలంటే సుమారు 30కిలోమీటర్ల దూరం ప్రయాణం అదనంగా చేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎదునూరి మల్లేశం, మండల కమిటీ సభ్యులు అబ్దుల్లాపురం వెంకటేశం, గ్రామ కార్యదర్శులు ఏదునూరి వెంకటేష్, బాలయ్య, పాల సంఘం చైర్మన్ పాండు, కృష్ణ, పరమేష్, వెంకటస్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

భువనగిరి : పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా శనివారం మొహర్రం వేడుకలను ముస్లింలు, హిందువులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు పీర్లకు దట్టీలు, కుడకలు, బెల్లం సమర్పించుకుని మొక్కులు చెల్లించారు.

రామన్నపేట : మండల వ్యాప్తంగా మొహర్రం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పీర్లను దట్టీలు, పూలమాలలతో అందంగా అలంకరించి డప్పు చప్పుళ్లతో వీధుల్లో ఊరేగించారు. వేడుకల్లో మాజీ వైస్‌ఎంపీపీ బద్దుల ఉమారమేష్, పంజాల నరేష్, ఎండీ అబ్దుల్ మోహన్, కె.పాండురంగాచారి, బైకానీ మహేష్, శ్రీనివాస్, నర్సింహ, యాదయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండల వ్యాప్తంగా మొహర్రం పండుగను హిందూ, ముస్లింలు మతసామ్యాన్ని చాటుతూ శనివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆశుర్‌ఖానా ఆవరణలో పీర్లను ఎత్తుకొని సంబరాలు చేశారు. కార్యక్రమంలో అజ్జు, వహీద్, ఇబ్రహీం, గౌస్, హస్సేన్ హుస్సేన్ పీర్ల కమిటీ అధ్యక్షుడు కొండ శివ, కొండ భాస్కర్, ముత్యాలు, తంగెళ్ల సత్తయ్య, కట్కూరి రాజు, బుచ్చయ్య, నర్సింహ, యాదగిరి, కృష్ణ, మహేశ్, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లోని ప్రజలు భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్ల కొట్టం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. చొల్లేరులో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ పీర్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కర్రె వెంకటయ్య, తోటకూరి బీరయ్య, వంటేరు సువర్ణ, బీమగాని రాములు, స్వరూప, పద్మ, తిరుమల పాల్గొన్నారు.

మోటకొండూర్ : కులమతాలకు అతీతంగా మండల వ్యాప్తంగా శనివారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో పీర్లను డప్పుచప్పుల్లతో ఊరేగించి నిమజ్జనం చేశారు.



భువనగిరి : పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



యాదగిరిగుట్ట రూరల్ : మొహర్రం వేడుకల్లో పాల్గొన్న జెడ్పీటీసీ అనురాధ తదితరులు

రాజాపేట : మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీరీలను డప్పుచప్పులతో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు పీరీలకు దట్టీలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్, బాలయ్య, రాజు, శ్రీను పాల్గొన్నారు.

గుండాల : మండలంలోని వివిధ గ్రామాల్లో, మండల కేంద్రంలో మొహర్రం వేడుకను హిందూ, ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్లతో వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఖాసిం, శేఖర్, గౌస్, ఇర్ఫాన్, జలీల్, ఉస్మాన్, రాము, అనిల్, బక్కయ్య, వంశీ, మల్లేష్, భరత్, జమాల్, మల్లయ్య పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండలంలో మొహర్రం వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లతో ఉరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : మండలంలో శనివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను వీధుల్లో ఊరేగింపు చేశారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం మొహర్రం వేడుకను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీర్లను ఊరేగించారు. రాత్రి స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.



రామన్నపేట : బోగారంలో మొహర్రం వేడుకలు

చౌటుప్పల్ : మండల వ్యాప్తంగా మొహర్రం వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా వివిధ రకాల సవార్లను (పీర్లు) ప్రజలు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ముగింపు రోజున గ్రామాల్లోని అషర్‌ఖాన(పీర్లకొట్టం) వద్ద దట్టీలు, మట్కీలు సమర్పించుకున్నారు.

బొమ్మలరామారం : మండల వ్యాప్తంగా మొహర్రం పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. కార్యక్రమంలో భాబుఖాన్, పాష, సలీం, జహంగీర్, జమీల్, సర్దార్ పాల్గొన్నారు.

బీబీనగర్ : మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను గ్రామాల్లోని వీధుల్లో ఊరేగింపు చేశారు.



సంస్థాన్ నారాయణపురం : పీర్ల ఊరేగింపు..



మోటకొండూర్ : పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



పోచంపల్లిలో పీర్లపండుగ సందడి

బునాదిగాని కాల్వగండి పరిశీలన

బీబీనగర్ : మండలంలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో గండిపడిన బునాదిగాని కాల్వను శనివారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాల్వకు గండి పడడంతో పంట పొలాలు నీట మునగడంతో పాటు ఇళ్లల్లోకి నీరు వస్తుందని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామాంజనేయులు, శ్యామ్ గౌడ్, నరేందర్‌రెడ్డి, గోద శ్రీనివాస్, బాలకృష్ణ, పెంటయ్య, బస్వయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె

ఆత్మకూరు(ఎం) : తమ సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల చేపట్టిన సమ్మె శనివారం నాటికి 24వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పెద్దపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు ఎర్రబాటి రాజు గుండెపోటులో మృతి చెందడంతో రెండు నిమిషాల మౌనం పాటించారు. కార్యక్రమంలోసత్యపాల్, జ్ఞానేశ్వర్, శ్రీను, స్వామి, భాను, నరసింహ, యాదయ్య పాల్గొన్నారు.

గుండాల : తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం మండల కేంద్రంలో కొనసాగింది. కార్యక్రమంలో పరుశరాములు, శేఖర్, యాదగిరి, సురేష్, రాములు, శ్రీను, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం కొనసాగింది. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోగారం వీరస్వామి, బైరపాక సర్వయ్య, శ్రీమంతుల వెంకటేశ్వర్లు, అశోక్, అరుణ, లలిత, మణెమ్మ, ఎల్లమ్మ ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 24వ రోజుకు చేరింది. కార్యక్రమంలో చాంద్‌పాష, లింగస్వామి, ఉపేందర్, బాబు, శారద, శంకర్, స్వామి, పద్మ, నర్సింహ, రాణి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.



రాజాపేట : సమ్మెలో పాల్గొని తన అమ్మమ్మకు మద్దతు తెలుపుతున్న చిన్నారి

కొవ్వొత్తులు వెలిగించి నిరసన

మోత్కూరు : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ కార్మికుల చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 24వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో పంచాయతీ కారోబార్ ఏరబాటి రాజు మృతికి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు సూరారం భాస్కర్, సూరారం నాగరాజు, ఆంజనేయస్వామి, కృష్ణ, ఝాన్సీ, పరశురాములు, శైలజ, సైదులు, ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

అడ్డగూడూరు : తమ సమస్యలు పరిష్కరించాలని మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 24వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్మికులు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు మల్లయ్య, శివ, సోమన్న, అవిలయ్య, బీరప్ప, సజ్జు, నర్సింహ పాల్గొన్నారు.



అడ్డగూడూరు : నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

జీపీ కార్మికులకు దళితబంధు ప్రకటించాలి

రాజాపేట : గ్రామపంచాయతీ కార్మికులకు దళితబంధు ప్రకటించి వారిని ఆదుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న కార్మికులకు బీజేపీ నాయకులు తమ సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, సిద్దేశ్వర్, లక్ష్మణ్, వినోధ్, శంకర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తు గడువు పొడిగింపు

రామన్నపేట : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అతిథి అధ్యాపక పోస్టుల దరఖాస్తు గడువును ఆగస్టు 2వ తేదీ వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బైపీసీలలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

భువనగిరి : పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరంలో బైపీసీ గ్రూప్‌లో ఖాళీ సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీరాం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31న కళాశాలలో హాజరు కావాలని, వివరాలకు 9949356343ను సంప్రదించాలని కోరారు.

బండి సంజయ్ నియామకంపై హర్షం

మోత్కూరు : కరీంనగర్ ఎంపీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆ పార్టీ నియమించడం పట్ల బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వలిగొండ : మండలంలోని కెర్చిపల్లి గ్రామానికి చెందిన పలువురు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందడంతో వారికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులు అచ్చిరెడ్డి రూ.51,500, శ్రీకాంతాచారికి రూ.28వేల చెక్కును శనివారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దెల మంజుల, నాగరాజు, సత్తిరెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌రెడ్డిని కలిసిన క్రీడాకారులు

సంస్థాన్ నారాయణపురం : మండల వాలీబాల్, క్రికెట్ టీం క్రీడాకారులు గుత్తా వెంకటరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆట స్థలాన్ని తయారు చేయడానికి పూర్తి ఖర్చులు ఇస్తానని, క్రికెట్ కిట్స్, వాలీబాల్ కిట్స్ అందజేస్తామని హామీ ఇచ్చినట్లు క్రీడాకారులు తెలిపారు. కలిసిన వారిలో కొప్పు రామకృష్ణ, వినుకొండ శ్రీనివాస్, సూర్య, ఆదిత్య, శ్రీహరి ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

భువనగిరి : మండలంలోని వడాయిగూడెం గ్రామానికి చెందిన బబ్బూరి సుమన్‌గౌడ్ కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో శనివారం శ్రీ కృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అతడికి ఆస్పత్రికి ఖర్చు కోసం రూ.45వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో యూత్ గౌరవ అధ్యక్షుడు శెట్టి గోపాల్‌యాదవ్, అధ్యక్షుడు శెట్టి వంశీ, యాదగిరి, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, కోఆర్డినేటర్స్ అశోక్, వెంకటేష్, శంకర్ తదితరులు ఉన్నారు.

భువనగిరి : మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన రైతు పడమటి మల్లారెడ్డి(65) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో గ్రామ పీఏసీఎస్ డివిడెండ్ నిధి కింద మృతుడి కుటుంబానికి ఆ సంఘం చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.30వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎలిమినేటి మల్లారెడ్డి, డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, మహేందర్, సీఈఓ దంతూరి నర్సింహ, గుర్రం నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రిని కలిసిన మార్కెట్ చైర్మన్

భువనగిరి : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా పాత మార్కెట్ కమిటీ భవన సముదాయ ప్రాంతంలో నూతన మార్కెట్ కమిటీ భవన నిర్మాణంపై ఆయనకు వివరించారు. భవన నిర్మాణ నిధుల మంజూరుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, మార్కెట్ కమిటీ కార్యదర్శి అంజిత్‌రావు ఉన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

రామన్నపేట : మండలంలోని దుబ్బాక గ్రామంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు చెందిన యువకులు శనివారం శ్రమదానం చేశారు. గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో గ్రామంలోని పలు వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కంబాలపల్లి నాగరాజు, మేడి లింగస్వామి, కంబాలపల్లి మల్లేష్, నీల నవీన్, ఇట్టె సందీప్ తదితరులు పాల్గొన్నారు.